

బెడ్ పద్ధతి మేలు
చెరుకు సాగులో రైతులు సంప్రదాయ పద్ధతికి స్వస్తి చెప్పి నూతన ఒరవడికి నాంది పలుకుతున్నారు.
8లో▸



దుండగులను గుర్తించాలి
ఆలయ సమీపంలో ఆవు కళేబరాన్ని వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.
8లో▸



వృద్ధురాలి హత్య
మద్యం, గంజాయి మత్తులో నిందితులు ఒడిగట్టిన దారుణానికి ఓ వృద్ధురాలి ప్రాణం పోయింది.
8లో▸

న్యూస్‌రీల్

భూ భారతితో సత్వర పరిష్కారం
కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ భారతి చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం మండలంలోని రావులపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజల నుంచి భూ సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా, వివరాల నమోదులో ఎలాంటి తప్పులకు తావులేకుండా చూడాలన్నారు. సమస్యల వారీగా దరఖాస్తులను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపరచాలని సూచించారు. ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తునూ స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ అనిత, ఆర్ఐ రాఘవేందర్, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అరెస్టు అన్యాయం



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్ రూరల్: తాండూరు మండలం బెల్కటూర్ గ్రామంలో దళితులపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని తాండూరు డీఎస్పీ కార్యాలయం ముందు శాంతియుత ధర్నా చేస్తుంటే పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బెల్కటూర్‌లో దళిత యువకుడి పెళ్లి వేడుకను అడ్డుకొని కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అగ్రకుల పెత్తందారులకు కొమ్ముకాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బుస్స చంద్రయ్య, యూ.రమేష్‌బాబు, జగన్, గోవిందు, కనకప్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

18లోపు దరఖాస్తు చేసుకోండి



జయసుధ

అనంతగిరి: అర్హులైన దివ్యాంగులు సహాయ ఉపకరణాల కోసం ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి పి.జయసుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా 2024– 25 ఆర్థిక సంవత్సరానికి గాను పరికరాలు, లర్నింగ్ మెటీరియల్ తదితర వాటిని ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. శారీరక దివ్యాంగులు, అంధులకు, బధిరులకు, మానసిక దివ్యాంగు లకు అవసరమగు పరికరాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు నిర్ణయించిందన్నారు. అన్ని ధ్రువ పత్రాలతో ఈ నెల 18లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ పరిశీలించి నియమ నిబంధనల మేరకు అర్హత గల దివ్యాంగులను ఎంపిక చేస్తారన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమ శాఖాధికారి కార్యాలయం సెల్ నంబర్ 81794 32874 లో సంప్రదించాలని ఆమె సూచించారు.

కేటీఆర్‌ను కలిసిన శుభప్రద్‌పటేల్



అనంతగిరి: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలపై చర్చించినట్లు తెలిసింది.

అంగన్వాడీ బలపడేలా..

‘అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట’తో ప్రజల్లోకి..

- చిన్నారుల సంఖ్య పెంపే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక
- వారం రోజులపాటు కార్యక్రమాలు
- నేటి నుంచి శ్రీకారం



మమ్మదన్‌పల్లిలో అంగన్‌వాడీ బాట నిర్వహిస్తున్న టీచర్లు(ఫైల్)

నవాబుపేట: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమైంది.. విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా ముందుకు సాగనుంది. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. బడిబాట తరహాలోనే అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో పర్యటించి కేంద్రాల్లో అందే సేవలపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. తద్వారా పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు వారిని ఒప్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, తీసుకుంటున్న శ్రద్ధ, పౌష్టికాహారం తదితర వటి గురించి వివరిస్తారని పేర్కొన్నారు.

వికారాబాద్ ప్రాజెక్టు పరిధిలో..

ఐసీడీఎస్ వికారాబాద్ ప్రాజెక్టు పరిధిలోని వికారాబాద్, ధారూరు, పూడూరు, నవాబుపేట మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 233 అంగన్‌వాడీ కేంద్రాలు.. 2వేల మందికి పైగా చిన్నారులు ఉంటారు. ఈ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అమలు చేస్తారు. ప్రస్తుత సంవత్సరంలో పిల్లల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా సిబ్బంది ముందుకు సాగనున్నారు.

రోజువారీ కార్యక్రమాలు..

- ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
- 11న గ్రామంలోని ఉపాధ్యాయులు, ఎన్జీవో సంఘాలు, తల్లిదండ్రులు, పోషక అభియాన్ సిబ్బందితో ర్యాలీలు నిర్వహించాలి. గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలి. బెల్ కొట్టాలి, పిల్లలకు ఎగ్ బిర్యానీ, స్వీట్లు ఇవ్వాలి.
- 12న గ్రామాల్లోని మూడేళ్ల లోపు పిల్లలను గుర్తించాలి. వారందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించాలి. ప్రభుత్వం పిల్లలకు అందిస్తున్న సేవలను వివరించాలి. కేంద్రాల్లో విద్యార్థులను నమోదు చేయాలి. గత సంవత్సరం చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయాలి. ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.
- 14న స్వచ్ఛ అంగన్‌వాడీ పేరుతో కేంద్రాలను శుభ్రం చేయాలి. అవకాశం ఉన్నచోట మొక్కలు నాటాలి. తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లను ఉపయోగంలోకి తేవాలి. కేంద్రాలు విద్యార్థులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలి.

“ సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నాం. ప్రభుత్వం పిల్లలకు అందిస్తున్న సేవలను, సౌకర్యాలను వివరిస్తాం. తద్వారా విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తాం. ఇందుకు గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ఎన్జీవోలు, యువజన సంఘాల నాయకులు సహకరించాలి.

– వెంకటేశ్వరమ్మ, ఐసీడీఎస్ సీడీపీఓ, వికారాబాద్

- 16, 17 తేదీల్లో కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించాలి. పిల్లలకు పాఠాలు, టైం టేబుల్, సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి. స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలి.



తాండూరు పట్టణంలో నిరసన తెలుపుతున్న పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు

ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం

- సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని అరెస్టు అప్రజాస్వామికం
- టీజేఎస్, బీఎస్పీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

తాండూరు: ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ప్రజలకు దూరమైందని టీజేఎస్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఎస్ సోమశేఖర్, దొరశెట్టి సత్యమూర్తి ఆరోపించారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌రావును అరెస్టు చేయడాన్ని, ఏపీలో ‘సాక్షి’ కార్యాలయాలపై టీడీపీ మూకలు దాడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ తాండూరు పట్టణం మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాక్షి దినపత్రిక, సాక్షి టీవీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, టీజేఎస్, బీఎస్పీ నాయకులు,ఎస్ఎస్పీ ట్రస్ట్ ప్రతినిధులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత మూటగట్టుకుందని తెలిపారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్పీ ట్రస్ట్ ప్రతినిధి భానుప్రసాద్,పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పీశ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, బీఎస్పీ నాయకులు అమ్జాద్ అలీ పాల్గొన్నారు.

సున్నిత ప్రాంతాల్లో రాచకొండ సీపీ తనిఖీలు

పహాడీషరీఫ్: సున్నితమైన బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రెండు ఠాణాల పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌తో పాటు స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ ఏ తరహా చేపడుతున్నారనే విషయమై మహేశ్వరం జోన్ డీసీపీ డి.సునీతా రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు భద్రత విషయంలో భరోసా కల్పించాలని బాలాపూర్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.సుధాకర్, పి.గురువారెడ్డికి సూచించారు. నగర శివారు ప్రాంతం కావడంతో ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీ చేపట్టాలన్నారు. తనిఖీల సమయంలో పరిశీలించాల్సిన అంశాలపై సూచనలు చేశారు. తనిఖీల్లో మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ జానకీ రెడ్డి పాల్గొన్నారు.



నవాబుపేట: ఫెర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి తదితరులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి

నవాబుపేట: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం నవాబుపేట మండలం పులుమామిడి గ్రామంలోని ఫెర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..విత్తనాలు కొనే ముందు రైతు లు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన షాపుల్లోనే కొనుగోలు చేయాలన్నారు. అనంతరం గ్రామంలో పత్తి పంటను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ఏఈఓలు, రైతులు ఉన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ



కొడంగల్: ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కొడంగల్: పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను టాస్క్‌ఫోర్స్ బృందం, పోలీసులు, వ్యవసాయాధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మినా, బిల్లులు లేకుండా ఎరువులు, విత్తనాలు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని సూచించారు.ఎమ్మార్పికే విత్తనాలు విక్రయించాలన్నారు. లైసెన్సు లేకుండా ఎరువులు, విత్తనాలు అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కర్ణాటక నుంచి అక్రమంగా సరఫరా చేస్తున్న నాసిరకం విత్తనాలను విక్రయిచరాదన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఏడీఏ శంకర్ రాథోడ్, ఎస్ఐ సత్యనారాయణ, ఏఓ తులసీ, టాస్క్‌ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు.

విధులపై అవగాహన పెంచుకోవాలి



హాస్టల్ వార్డెన్లకు విధులపై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

- అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: కొత్తగా ఉద్యోగాల్లో చేరిన హాస్టల్ వార్డెన్లు వీలైనంత త్వరగా విధులపై అవగాహన పెంచుకోవాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నూతనంగా ఎంపికైన ఎనిమిది మంది వసతి గృహ అధికారులకు మంగళవారం వికారాబాద్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దే దిశగా పనిచేయాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మెనూ అమలు, ఆహార పదార్థాల నిల్వలు తదితర విషయాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. విద్యాశాఖతో అనుసరించాల్సిన విషయాలను డీఈఓ నుంచి అడిగి తెలుసుకోవాని సూచించారు. నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణపై ట్రెజరీ అధికారుల సూచనల ను పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీడీఓ కమలాకర్ రెడ్డి, డీబీసీడీఓ ఉపేందర్, డీఈఓ రేణుకాదేవి, డీఎంహెచ్ఓ వెంకటరవణ, డీటీఓ జార్సన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దాం

- ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- పురపాలక పరిపాలన కమిషనర్ డైరెక్టర్ టీకే శ్రీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి (చిత్రంలో) కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

కొడంగల్: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పురపాలక పరిపాలన కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ టీకే శ్రీదేవి అన్నారు. కొడంగల్ మున్సిపాలిటీలో మంగళవారం ఆమె పర్యటించారు. పట్టణంలో చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వివిధ అభివృద్ధి పనులు, తడి పొడి చెత్త విభజనపై అవగాహన, ఆరోగ్య శిబిరాల నిర్వహణ, మురుగు కాల్వల్లో పూడికతీత పనులను కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కడా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం దెబ్బతింటోందన్నారు. మహిళా సంఘాల సభ్యులతో టెంట్ హౌస్‌లను ఏర్పాటు చేయించి ప్లాస్టిక్‌కు సంబంధించిన సామగ్రి సరఫరా లేకుండా శుభ కార్యక్రమాలు జరిగే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడడానికి ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వాడాల్సిన వస్తువులపై ప్రజలకు తెలియచేయాలని ఆదేశించారు. మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీసి శుభ్రంగా ఉంచాలన్నారు. దోమల బెడద నివారించేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలన్నారు. కొడంగల్‌ను సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. పనుల్లో వేగం పెంచాలని సూచించారు. పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా ఉండకుండా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.అంతకుముందు మున్సిపల్ పరిధిలో జిల్లా అధికారులతో కలిసి మొక్కలు నాటారు.పట్టణంలోని పార్కులను, నీటి సరఫరా ట్యాంకులను పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్ పల్గున్ కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యకర ప్రవర్తన
ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు



నిందితుడు ప్రకాష్

తాండూరు రూరల్: బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. మంగళవారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(15) తాండూరు పట్టణంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు వచ్చింది. పరీక్ష ముగిసిన తర్వాత మధ్యాహ్నం ఇంటికి వెళ్లేందుకు పట్టణంలోని చౌరస్తా వద్ద నిలబడింది. గమనించిన బెల్కటూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ప్రకాష్ బాలిక వద్దకు వచ్చి మీ ఊరికే వెళ్తున్నాను ఆటో ఎక్కమన్నాడు. నేను ఒక్కదాన్నే ఆటోలో రానని బాలిక చెప్పింది. మార్గమధ్యలో ప్రయాణికులు ఎక్కుతారని డ్రైవర్ నమ్మబలికాడు. దీంతో ఆటో ఎక్కింది. చిట్టిఘనాపూర్ గేటు వద్దకు రాగానే ఆటోను పొలాల్లోకి తీసుకెళ్లాడు. అమ్మాయితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కేకలు వేసింది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు అక్కడికి చేరుకొని బాలికను రక్షించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆటో డ్రైవర్ ప్రకాష్‌ను అదుపులోకి తీసుకొని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

డీఎస్పీని సస్పెండ్ చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య

పరిగి: పెత్తందార్లకు కొమ్ము కాస్తున్న తాండూరు డీఎస్పీని వెంటనే సస్పెండ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలో దళితులపై దాడి చేసిన అగ్రకులాల వారిని వెంటనే అరెస్టు చేయాలని ప్రజాసంఘాల నేతలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు మండలం బెల్కటూర్‌లో కొన్ని రోజుల కిందట దళితుడు పెళ్లి చేసుకుని గ్రామంలో బరాత్ ఊరేగింపును కొంతమంది అగ్రకుల పెత్తందారులు అడ్డుకొని దాడి చేశారన్నారు. వారిని అరెస్టు చేయాలని సోమవారం దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహిస్తే తమని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ హబీబ్, సత్యయ్య, రఘురామ్, సీహెచ్. సత్యయ్య, శేఖర్, రాంచంద్రి, ప్రశాంత్, వెంకటయ్య, అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

యాలాల: బెల్కటూరులో జరిగిన ఘటనలో అట్రాసిటీ నిందితులకు తాండూరు డీఎస్పీ అనుకూలంగా వ్యవహరిస్తూ కేసును నీరుగార్చేందుకు యత్నిస్తున్నాడని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య ఆరోపించారు. ఈ విషయమై మంగళవారం మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహం ఎదుట హోలియా దాసరి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబదాస్, వ్యకాస జిల్లా అధ్యక్షుడు బుగ్గప్పలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. బెల్కటూరులో దళితుల పెళ్లి బరాత్‌లో అగ్రకులస్తులు అడ్డుకోవడాన్ని అన్యాయమన్నారు. ఘటనకు కారణమైన వ్యక్తులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రప్ప, నర్సప్ప, నర్సింహులు, హన్మంతు ఉన్నారు.



యాలాల: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

కొమ్మినేని అరెస్టు అక్రమం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్



బంట్వారం: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్‌రావుపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేయడం హేయమైన చర్య అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ అన్నారు. ఏపీలో సాక్షి కార్యాలయాలు, కొమ్మినేని అరెస్టును తీవ్రంగా ఖండించారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కూటమి ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఏడాది కాలంగా ఏపీలో భయానక వాతావరణం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని చూడటం సరైనది కాదని హితవు పలికారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రవి (ఫైల్)

బొంరాస్‌పేట: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రవూఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బొంరాస్‌పేటకు చెందిన భార్యాభర్తలు తొగపురం రవి(40), సునీత మధ్య ఆదివారం రాత్రి డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో రవి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం నుంచి బంధువులు, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం పొలానికి వెళ్తున్న స్థానికులకు.. గ్రామ శివారులోని ఓ చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అందరూ వచ్చి పరిశీలించగా రవి అప్పటికే చనిపోయాడు. మృతుడి సోదరుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలు(హకీంపేట్, కరీంనగర్, అదిలాబాద్) 2025–26 సంవత్సరానికి గాను నాలుగో తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థిని విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల శాఖ అధికారి ఎంఏ సత్తార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను టీజీఎస్ఎస్. తెలంగాణ. జీఓవీ.ఇన్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఓయూ ఎంట్రెన్స్ టెస్ట్‌లో సత్తాచాటిన విద్యార్థులు



రేఖ



శ్రావణ్‌కుమార్

అనంతగిరి: ఓయూ పీహెచ్‌డీ ఎంట్రెన్స్ టెస్ట్ గణితశాస్త్రం విభాగంలో వికారాబాద్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకు సాధించి సత్తా చాటారు. మున్సిపల్ పరిధిలోని రామయ్యగూడకు చెందిన కె.రేఖ 8వ ర్యాంక్, మర్పల్లి మండలానికి చెందిన శ్రావణ్‌కుమార్ 16వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచి ర్యాంకులు రావడం సంతోషంగా ఉందన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

శంకర్‌పల్లి: ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి, చేసిన అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం శంకర్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన బండి రామమైసూర్‌రెడ్డి(44), చిన్న వ్యాపారం చేస్తూ.. జీవనోపాధి పొందేవాడు. ఈ క్రమంలో వ్యాపారం సాగక.. ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడ్డాడు. అక్కడా నష్టం రావడంతో అప్పులు చేశాడు. అవి తీర్చేమార్గం కానరాక సతమతమయ్యాడు. దీంతో సోమవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎంత కీ రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు మంగళవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు, సదరు వ్యక్తి లోకేషన్ చూడగా.. శంకర్‌పల్లిలోని ఓ లాడ్జి చూపించింది. అక్కడికి వెళ్లి లాడ్జిలోని గదులను పరిశీలించగా.. ఓ గదిలో ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

బెడ్ పద్ధతి మేలు

- చెరుకు సాగులో నూతన ఒరవడికి శ్రీకారం
- తగ్గనున్న పంట పెట్టుబడులు
- ఆసక్తి చూపుతున్న రైతులు



మోమిన్‌పేటలోని ఏన్కతలలో నాటిన చెరుకు

మోమిన్‌పేట: చెరుకు సాగులో నూతన ఒరవడికి రైతులు నాంది పలుకుతున్నారు. సంప్రదాయ సాగుకు స్వస్తి పలుకుతూ తక్కువ విత్తన మోతాదుకు శ్రీకారం చుడుతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న పెట్టుబడులు, కూలీల ఖర్చులను తగ్గించుకుంటూ ఎక్కువ దిగుబడులను సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఒకప్పుడు బోజ పద్ధతిలో చెరుకు సాగును చేపట్టారు. ప్రస్తుతం ఎక్కువగా బెడ్ పద్ధతిని అవలంబిస్తూ కూలీల ఖర్చును తగ్గిస్తున్నారు. పంటలో కలుపు తగ్గించేందుకు బెడ్ పద్ధతి ఎంతో ఉపయోగకరమని రైతులు పేర్కొంటున్నారు. చిన్న ట్రాక్టరుల ద్వారా బెడ్ మధ్యలో నాగలి, గుంటుక, రోటోవేటరును వేసుకొని గడ్డి జాతి మొక్కలను నివారించుకోవచ్చు. దీంతో పాటు విత్తనం ఖర్చును తగ్గించుకొనేందుకు నర్సరీలో పెంచుతున్న చెరుకు మొక్కలను వినియోగిస్తున్నారు.

నర్సరీ నుంచి మొక్కలు

నర్సరీలో పెంచిన ఒక్కో మొక్కకు రకాన్ని బట్టి రూ.2.50 నుంచి రూ.3.50 వరకు ఉంటుంది. బెడ్ పద్ధతిలో మొక్కలను నాటుకోవడంతో విత్తన మోతాదు తగ్గుతుంది. చెరుకు గడలోని విత్తనం వచ్చే ఒక ఇంచును కట్ చేసి నర్సరీలో సేంద్రియ ఎరువుల సహాయంతో ప్లాంటుపై పెంచుతారు. ఒక ఫీట్ పెరిగిన చెరుకు విత్తనాన్ని తీసుకువచ్చి నేరుగా పొలంలో నాటుతారు. దీంతో చాలావరకు కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. చెక్కర ఫ్యాక్టరీ యాజమాన్యం కొన్ని రకాలను హైబ్రిడ్ వంగడాలను అన్నదాతలకు ఇస్తుంది. దీన్ని తీసుకువెళ్లి నర్సరీలో పెంచుతున్నారు. ఒకప్పుడు చెరుకు గడలను రెండు ఫీట్ల పొడవుతో భూమిలో తొక్కేవారు.



నర్సరీలో పెంచిన చెరుకు మొక్కలు

వీటన్నింటికి విత్తన ఖర్చు ఎక్కువ కావడం.. రైతులకు దిగుబడులు రాకపోవడంతో నష్టాలు చవిచూసేవారు. మండల పరిధిలోని ఏన్కతల గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ అనే రైతు పొలాలను కౌలుకు తీసుకొని చెరుకు సాగును చేపట్టారు. నర్సరీలో పెంచిన విత్తనాలను పొలంలో నాటుతున్నారు.

దుండగులను గుర్తించాలి

సీఐ కార్యాలయంలో బీజేపీ నాయకుల వినతి

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఖాంజాపూర్ గేటు వద్ద ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఆవు కళేబరాన్ని వేసిన దుండగులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రూరల్ సీఐ కార్యాలయంలో పోలీసులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. తాండూరు పట్టణంలో అల్లర్లు సృష్టించేందుకు కొంతమంది ఉద్దేశ పూర్వకంగా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ఆంజనేయులు, బంటారం భద్రేశ్వర్, కృష్ణముదిరాజ్, పట్టణ, మండలాల బాధ్యులు రజనీకాంత్, నాగారం మల్లేశం, యాలాల శివకుమార్, మఠం మల్లిఖార్జున్ తదితరులు ఉన్నారు.

మూగజీవి తల కలకలం

యాలాల: మండల పరిధిలోని బైపాస్ రోడ్డు సమీపంలో కనిపించిన మూగజీవి తల కలకలం రేపింది. ఈ విషయమై బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌తో పాటు పలువురు నాయకులు సోమవారం రాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డి, సీఐ నగేష్, ఎస్ఐ గిరి ఘటన స్థలానికి చేరుకొని తలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు యాలాల పీఎస్‌లో కేసు నమోదు చేశారు. తల ఆవుదా..? గేదెదా..? స్పష్టత లేదని.. పరీక్షల కోసం చెంగిచెర్లలోని సెంట్రల్ మీట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించామని డీఎస్పీ తెలిపారు. పశువుల వ్యర్థాలను తరలించే వాహనంలో నుంచి పడిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



పైపు లీకై.. వృథాగా నీరు

దుద్యాల్: మిషన్ భగీరథ పైపులైన్ లీకవ్వడంతో నీరంతా వృథాగా పోతుంది. దుద్యాల్, సోమ్లనాయక్ తండా గ్రామాల మధ్యలో రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో పైపులైన్ పగిలిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామానికి సరఫరా అయ్యే ప్రధాన లైన్ కావడంతో తాగునీటికి ఇబ్బంది కలుగుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పది టిప్పర్లు, జేసీబీ సీజ్

- యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు
- మరోసారి పట్టుబడితే నాన్ బెయిలబుల్ కేసులు
- షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్



వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ అన్వర్

షాబాద్: ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్ హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు అలవాటు పడిన కొందరు ప్రభుత్వ భూముల్లోని మట్టిని అక్రమంగా తవ్వి, ప్రైవేట్ కంపెనీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. సోలీపేట్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 350లో ఉన్న 120 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సమాచారం రావడంతో సోమవారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. పది టిప్పర్లు, ఒక జేసీబీని అదుపులోకి తీసుకున్నామని స్పష్టంచేశారు. వీటికి సంబంధించిన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశామన్నారు. మరోమారు ఇలాంటి అక్రమాలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని, ఈసీ వాగు నుంచి ఇసుక తరలిస్తున్న వారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

30 వరకు సన్నబియ్యం పంపిణీ

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: రేషన్ కార్డుదారులకు అందిస్తున్న బియ్యాన్ని ఈ నెల 30 వరకు పంపిణీ చేస్తారని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించి రేషన్ బియ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంలో ఎవరూ కంగారు పడొద్దని ఆయన సూచించారు. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం ఇస్తారని చెప్పారు.

తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్య

తాండూరు రూరల్: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతమణిపట్నం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆశప్ప(40) తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. మంగళవారం హైదరాబాద్ నుంచి చింతమణిపట్నం గ్రామానికి వచ్చాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదని భార్య వెంకటమ్మ పోలీసులకు తెలిపింది.

తాగిన మైకంలో తూలి..

అనంతగిరి: తాగిన మైకంలో మురుగు కాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం వికారాబాద్ పట్టణంలోని బస్టాండ్ రోడ్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోట్‌పల్లి మండలానికు చెందిన కె.వెంకటేశం(26) తల్లిదండ్రులు మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. బతుకుదెరువు కోసం వికారాబాద్‌కు వచ్చి కూలి పనులు చేస్తూ వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి మద్యం తాగి మూత్ర విసర్జన కోసం వెళ్లి మురుగు కాల్వలో తూలి పడి మృతి చెందాడు. ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుని అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

లబ్ధిదారులకు శుభవార్త

తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇప్పటికే గ్రామాల్లో అర్హుల జాబితా ఎంపిక పూర్తయ్యింది. ఈ నెల 12న 690 మందికి మంజూరు కాపీలు అందజేయనున్నారు. పట్టణంలోని వీరశైవ ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తారని ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు.

భూదాన్ బోర్డు భూ సమస్యలపై అర్జీలు



అర్జీలు తీసుకుంటున్న డీటీ శ్రీనివాస్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఇబ్రహీంపట్నం భాగాయత్, ఇస్మాయిల్ పంపు, తట్టిఖానా, అల్లిమియాకుంట రెవెన్యూ భూ సమస్యలపై మంగళవారం స్థానిక ఓసీ కమ్యూనిటీ హాల్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వే నంబర్ 58, సైదాబాద్ కంచె, భాగాయత్, తట్టిఖాన రెవెన్యూ పరిధి భూదాన భూములకు సంబంధించి అధికంగా దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఆ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని పలువురు విన్నవించినట్లు పేర్కొన్నారు. భాగాయత్ పరిధి 120, తట్టిఖానా పరిధి 10, అల్లిమియా కుంట పరిధి నుంచి ఒక్క దరఖాస్తు అందిందని వివరించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

అనంతగిరి: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వికారాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం వికారాబాద్ – గోధుమగూడ రైల్వేస్టేషన్ల మధ్య ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే అధికారులు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని, చామనచాయ, బక్క పలుచని శరీరం కలిగి ఉన్నాడు. మృతుని ఒంటిపై తెలుపు నలుపు బూడిద రంగు డబ్బాల ఫుల్ షర్ట్, తెలుపు రంగు ప్యాంట్, నలుపు, ఎరుపు రంగు మొలతాడు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురిలో భద్రపరిచినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్ తెలిపారు. ఎవరైన ఆచూకీ తెలిసిన వారు ఉంటే వెంటనే సంప్రదించాలన్నారు.

దుర్వాసన భరించలేం..

- స్థానికుల ఆందోళన
- బొక్కల లోడ్‌తో దాణా ఫ్యాక్టరీకి వచ్చిన డీసీఎంల అడ్డగింత
- రెవెన్యూ, పోలీసు అధికారుల చొరవతో ఫ్యాక్టరీకి తాళం



దోర్నాల్‌లో వివరాలు సేకరిస్తున్న ఆర్డీఓ వాసుచంద్ర

ధారూరు: దాణా ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న దుర్వాసనను భరించలేకపోతున్నామని, దీన్ని వెంటనే మూసేయాలని స్థానికులు ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి.. దోర్నాల్ సమీపంలోని మరియా ఫీడ్ ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేసేందుకు సోమవారం రాత్రి బొక్కలతో నిండిన మూడు డీసీఎంలు గ్రామానికి చేరుకున్నాయి. వీటి నుంచి వస్తున్న దుర్వాసనను గమనించిన స్థానికులు వాహనాలను గ్రామంలోనే నిలిపేసి ఆందోళన చేపట్టారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందడంతో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూరు సీఐ రఘురాం, ఎస్ఐ అనిత అక్కడికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ సాజిదాబేగం మంగళవారం ఉదయాన్నే దోర్నాల్‌కు వెళ్లి వివరాలు సేకరించారు. కాలుష్య నియంత్రణ అధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. డీసీఎంలలో తెచ్చిన ఎముకలను ఫ్యాక్టరీలోకి తీసుకెళ్లి జేసీబీతో గుంత తవ్వించి, అందులో పూడ్చేశారు. అనంతరం ఫ్యాక్టరీకి తాళం వేయించారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



తాండూరు రూరల్: చింతమణిపట్నంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్



బొంరాస్‌పేట: కొత్తూరులో భూభారతి సదస్సులో రెవెన్యూ సిబ్బంది

పలు గ్రామాల్లో దరఖాస్తుల వెల్లువ

తాండూరురూరల్/బొంరాస్‌పేట/దౌల్తాబాద్/యాలాల/దుద్యాల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చింతమణిపట్నం, ఖాంజాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో రైతులకు భూ సమస్యలు ఉంటే వెంటనే రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండు గ్రామాల్లో కలిపి 12 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అలాగే బొంరాస్పేట మండల పరిధి కొత్తూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దార్ పద్మావతి హాజరై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. యాలాల మండలంలోని దేవనూరు, గోరేపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ఐదు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. దుద్యాల్ మండల చిలుముల్ మైల్వార్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 62 దరఖాస్తులు వచ్చినట్లు ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు ప్రకటించారు. దౌల్తాబాద్ మండలంలోని బాలంపేట, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దారు గాయత్రి తెలిపారు.



యాలాల: రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్



దుద్యాల్: చిలుముల్ మైల్వార్ రెవెన్యూ అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

శాంతిభద్రతల రక్షణకు చర్యలు



వాహనాల తనిఖీ చేపడుతున్న ఏసీపీ లక్ష్మీనారాయణ తదితరులు

ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్‌రూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంతో పాటు ఫరూఖ్‌నగర్‌లో మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేట్టారు. కిరాణా దుకాణాలు, బెల్టుషాపులు, దాబాలు, లాడ్జీలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నిషేధిత గుట్కాలు, అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో అపరిచితులకు దూరంగా ఉండాలని, అలాంటి వారు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో పట్టణ సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ నర్సయ్య, కేశంపేట సీఐ నరహరి, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు, ఎస్‌ఓటీ పోలీసులు, పాల్గొన్నారు.

కిరాణా దుకాణాల్లో రేషన్ బియ్యం పట్టివేత

శంకర్‌పల్లి: కిరాణా దుకాణాల్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు కిరాణ దుకాణాల్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచి అమ్ముతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో మంగవారం పలు దుకాణాల్లో దాడులు నిర్వహించారు. కోటికే ధనుంజయ్ దుకాణంలో నాలుగు క్వింటాళ్లు, అలంపల్లి శ్రీధర్ దుకాణంలో 3.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరికాయి. వాటిని స్వాధీనం చేసుకొని దుకాణ యాజమానులపై కేసులు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్‌లై అధికారులకు అప్పగించారు.

కత్తులతో పొడిచి వృద్ధురాలి హత్య

- **ప్రాణాపాయ స్థితిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు**
- పరిగి మండలం రాపోల్‌లో ఘటన
- కుటుంబ కలహాలే కారణం
- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు?



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పరిగి: మద్యం, గంజాయి మత్తులో నిందితులు ఒడిగట్టిన దారుణానికి ఓ వృద్ధురాలి ప్రాణం పోయింది. ఆమె కొడుకు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని రాపోల్‌కు గుండు రాజేందర్(40) ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఇదే గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ అనంతయ్య కూతురు సంగీతతో పదేళ్ల క్రితం ఇతనికి వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ఇదిలా ఉండగా కుటుంబ కలహాల నేపథ్యంలో రాజేందర్ కొన్నాళ్లుగా భార్యాపిల్లలకు దూరంగా ఉంటున్నారు. సోమవారం రాత్రి రాజేందర్ తన తల్లితో కలిసి ఇంట్లో ఉండగా.. అతని చిన్న మామ(సంగీత బాబాయి) ప్రభాకర్ వచ్చాడు. మామాఅల్లుళ్లు కలిసి మద్యం తాగుతూ కూర్చున్నారు. కొంత సమయం గడిచిన తర్వాత.. తన అన్న కూతురైన సంగీతను దూరం పెడుతూ ఆమె బతుకు నాశనం చేస్తున్నావంటూ ప్రభాకర్ అల్లుడితో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో ప్రభాకర్ తన అన్న కొడుకు(సంగీత తమ్ముడు)కు ఫోన్ చేసి రమ్మన్నాడు. అప్పటికే రాజేందర్‌పై కోపంగా ఉన్న అతను, మరికొందరు స్నేహితులతో అక్కడికి చేరుకున్నాడు. వెంట తెచ్చుకున్న కత్తులతో విచక్షణారహితంగా పొడిచారు. తీవ్ర గాయాలు రావడంతో రాజేందర్ కిందపడిపోయాడు. తన కొడుకును చంపొద్దంటూ అడ్డుకోబోయిన నర్సమ్మ(60)పై సైతం కత్తులతో దాడి చేయగా అక్కడికక్కడే మృతిచెందింది. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న రాజేందర్‌ను స్థానికులు పరిగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడిలో పాల్గొన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దాడికి పాల్పడిన యువకులు గ్రామానికి చెందిన వారేనని, గంజాయి మత్తులో ఈ దురాఘతానికి పాల్పడ్డారని తెలుస్తోంది.



రాజేందర్ (ఫైల్)



దాడిలో మృతి చెందిన నర్సమ్మ